ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5 సిద్దిపేట

మంగళవారం 2 జూలై 2024



టీచర్ల పదోన్నతులు, బదిలీలు పూర్తి

- సిద్దిపేట జిల్లాలో 622 మందికి పదోన్నతి
- 1,032 మంది టీచర్లు బదిలీ

7 లో

కౌన్సిలర్లుగా యశోదమ్మ, పుష్పమ్మలను గెలిపించాలి

- మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి



యశోదమ్మ, పుష్పమ్మలను కౌన్సిలర్లను గెలిపించాలని కార్యకర్తలను కోరుతున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 1 : రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సంగారెడ్డికి చెందిన యశోదమ్మ, పుష్పమ్మలను కౌన్సిలర్లుగా గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలను కోరారు. సంగారెడ్డి సమీపంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్‌లో సోమవారం ఆత్మ కమిటీ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యశోదమ్మ, పుష్పమ్మలు తాను జెండా పట్టిన నాటి నుంచి తనతోనే ఉన్నారని అన్నారు. సీనియర్ నేతలయిన వీరిద్దరూ తనను సొంత తమ్ముడికన్నా ఎక్కువగా చూసుకున్నారని, అలాంటి వారికి తానేమీ చేయలేకపోయానని పేర్కొన్నారు. ఈసారి వారిద్దరిని సంగారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లుగా గెలిపించాలని ఆయన కార్యకర్తలను కోరారు. వీరిద్దరి తరఫున ఎన్నికల ఖర్చు మనమే పెట్టుకోవాలని జగ్గారెడ్డి కార్యకర్తలకు సూచించారు.

కరోనా కాలంలో ధైర్యంగా సేవలు : జగ్గారెడ్డి



సంగారెడ్డికి చెందిన షఫీ తదితరులను అభినందిస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 1 : కరోనా సెకండ్ వేవ్‌లో పరిస్థితులు ఎంతో భయంకరంగా ఉన్నా సంగారెడ్డికి చెందిన షఫీ, నాయకులు శేరా, మజీద్, టిల్లుమామ, ఫయాజ్ టక్కర్ బాధితులకు ధైర్యంగా సేవలందించారని మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి ప్రశంసించారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనాతో మరణించిన వారి మృతదేహాలను తరలించడానికి కుటుంబ సభ్యులే భయపడుతున్న తరుణంలో కౌన్సిలర్ షఫీ ధైర్యంగా ముందుకువచ్చి మృతదేహాలను తరలించారన్నారు. కరోనా బాధితులను ఆసుపత్రిలో చేర్పించి ప్రాణాలు పోశారని ఆయన గుర్తుచేశారు. శేరా, మజీద్, టిల్లుమామ, ఫయాజ్ టక్కర్‌లు డయాలసిస్, తదితర వ్యాధులతో బాధపడుతున్నవారికి ఇప్పటికే సొంత ఖర్చులతో ఆక్సిజన్ సిలిండర్లు అందజేస్తుండడం అభినందనీయమని పేర్కొన్నారు. వీరికి వచ్చే పంద్రాగస్టు లోగా రూ.10 లక్షల చొప్పున అందజేయనున్నట్టు జగ్గారెడ్డి తెలిపారు.



సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో మాయమైన ఇసుక కుప్ప

ఇసుక దొంగలు!

- అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుకను సీజ్ చేసిన పోలీసులు
- సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డంప్
- లారీ ఇసుక మాయం
- కార్యాలయ అధికారే సన్నిహితులకు ఇచ్చినట్లు ఆరోపణలు
- కార్యాలయ అవసరాలకు వినియోగించినట్లు తహసీల్దార్ వివరణ

సిద్దిపేట టౌన్, జూలై 1: ఇంటి దొంగను ఈశ్వరుడైన పట్టలేడన్నట్లుగా ఉంది.. సిద్దిపేట అర్బన్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయం పరిస్థితి. సిద్దిపేట అర్బన్ మండలం పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలరోజుల క్రితం అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక వాహనాన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు అర్బన్ తహసీల్దార్‌కు సమాచారమందించి కార్యాలయంలో ఇసుకను డంప్ చేశారు. ఈ మేరకు డంప్ చేసిన ఇసుకను అర్బన్ తహసీల్దార్ వేలం ద్వారా విక్రయించి, వచ్చిన ఆదాయాన్ని కోర్టులో జమచేయాల్సి ఉంటుంది. ఇంతవరకు బాగానే ఉన్నా "తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక దొంగలు పడ్డట్టుగా" 15 రోజుల క్రితం డంప్ చేసిన దాంట్లోంచి దాదాపు 40 టన్నుల మేర ఇసుక మాయమైంది. దీంతో మొన్నటివరకు ఉన్న కార్యాలయంలో ఉన్న ఇసుక ఒక్కసారిగా మాయమవ్వడంతో సిబ్బంది, అధికారులు ఆశ్చర్యపోతున్నారు.

ఇసుకను సీజ్ చేసిన పోలీసులు

సిద్దిపేట జిల్లావ్యాప్తంగా ఈమధ్య కాలంలో అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక వాహనాలను సీజ్ చేసి సంబంధిత పోలీస్ స్టేషన్లకు అప్పగించడంతో వాహనాల యజమానులపై పోలీసులు కేసులు నమోదు చేసి, ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో డంప్ చేయిస్తున్నారు. వాటి యజమానులు వచ్చి కోర్టులో వేసిన జరిమానాను కట్టి వాహనాలను తీసుకెళ్తున్నారు. కాగా డంప్ చేసిన ఇసుకను కోర్టు అనుమతిలో సంబంధిత తహసీల్దార్లు వేలం వేసి వచ్చిన ఆదాయాన్ని కోర్టులో చూపించి, ప్రభుత్వ ఖజానాలో జమచేయాల్సి ఉంటుంది.



అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు (ఫైల్)

టన్ను ఇసుక ధర రూ. 1100 పైనే

జిల్లాలో యథేచ్ఛగా ఇసుక దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతున్నది. టన్ను ఇసుక ధర రూ.1,100 పైగానే పలుకుతోంది. రాత్రి సమయాల్లో ఇసుకను పెద్ద పెద్ద లారీల్లో, వాహనాల్లో తరలిస్తూ వారికి నచ్చిన ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. డిమాండ్ మేరకు వచ్చినట్లుగా ఇసుకను నిల్వ చేసిన ప్రాంతాల నుండి జేసీబీ, కార్మికులను నియమించుకొని ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్ వాహనాల్లో తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు.

ఇసుక హాంఫట్

సిద్దిపేటఅర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డంప్ చేసిన ఇసుక కుప్ప మాయమవడం చర్చనీయాంశంగా మారింది. దాదాపు రూ. 50 వేల నుంచి రూ. 60 వేల వరకు విలువ చేసే ఇసుక కుప్ప మాయం కావడం వెనుక ఎవరి హస్తముందోనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో నైట్‌వాచ్‌మన్‌గా పనిచేస్తున్న సిబ్బంది దగ్గరికి వచ్చిన కొందరు వ్యక్తులు... రెవెన్యూ కార్యాలయంలోని అధికారి ఇసుక తీసుకెళ్లమని చెప్పాడని తెలిపి ఇసుకను దర్జాగా తీసుకెళ్లినట్లు కార్యాలయ వర్గాల ద్వారా తెలిసింది. కార్యాలయంలోని ఓ అధికారి తన సన్నిహితులకు ఇసుకను అందించినట్లు కార్యాలయంలోనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

కార్యాలయ అవసరాలకు వినియోగించాం

కార్యాలయంలో డంప్ చేసిన ఇసుక మాయంపై తహసీల్దార్ సలీంమియాను ఫోన్‌లో సంప్రదించగా అలాంటిదేమీ లేదని చెప్పారు. నేరుగా కార్యాలయానికి వెళ్లి మరోమారు సంప్రదిస్తే కార్యాలయ అవసరాలకు వాడుకున్నట్లు పొంతన లేని సమాధానాలివ్వడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి

ఆపరేషన్ ముస్కాన్ షురూ



- ఈ సారి జిల్లాలో మూడు బృందాలు
- ఈ నెల 31 వరకు గాలింపు చర్యలు
- గత ఏడాది 48 మందికి, ఏడేండ్లలో 306 మంది బాలకార్మికులకు విముక్తి

సిద్దిపేట క్రైం, జూలై 1 : చదువుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాల్సిన చిన్నారులు బడిబయట తిరుగుతున్నారు. వీధుల్లో తిరుగుతూ భిక్షాటన చేసేవారు కొందరైతే, మెకానిక్ షాపుల్లో, ఇటుక బట్టీల్లో, ఖార్ఖానాలో వెట్టి చాకిరి చేస్తున్న వారు మరికొందరు. వీరందరికీ విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమాలతో జిల్లాలోని బాల కార్మికులకు విముక్తి లభిస్తుంది. జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలను పోలీస్ శాఖ ఇతర డిపార్ట్‌మెంట్ అధికారులు బృందాలుగా ఏర్పడి బాలికార్మికుల గుర్తించి వారిని సంరక్షణ కేంద్రాలకు పంపించారు. ఇప్పటి వరకు 306 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించారు.

జూలై 31 వరకు 'ఆపరేషన్ ముస్కాన్'

జిల్లాలో సోమవారం నుంచి ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు, బాలల సంరక్షణ అధికారులు, వైద్యాధికారులు, కార్మిక శాఖ పోలీసు అధికారులతో సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ సమీక్ష సమావేశం నిర్వహించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించేందుకు పలు సూచనలు చేశారు. సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్లలో మూడు బృందాలను ఏర్పాటు చేసి బాల కార్మికుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. గత సంవత్సరం ఆపరేషన్ ముస్కాన్ ద్వారా జిల్లాలో 48 మంది బాల కార్మికులను గుర్తించి సంరక్షణ కేంద్రాలకు పంపించారు. ఈసారి వివిధ శాఖల అధికారులతో సంయుక్తంగా పనిచేయాలని, జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని సూచించారు.

వివిధ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా..

జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్‌ను ప్రారంభించారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో పాటు బాలల సంరక్షణ వ్యవస్థ, వైద్య, విద్య, కార్మికశాఖల అధికారుల ఆధ్వర్యంలో జిల్లాలో మూడు బృందాలుగా ఏర్పడి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. బాల కార్మికుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు, వీధులలో తిరుగుతూ భిక్షాటన చేసే బాల బాలికలను, అనాథ పిల్లలను గుర్తించి సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు. బడీడు పిల్లలను బడిలో చేర్పిస్తారు. ముఖ్యంగా పరిశ్రమల్లో, మెకానిక్ షాప్‌లలో, గోదాముల్లో, ఇటుక బట్టీలలో తనిఖీలు నిర్వహించి బాలకార్మికులు ఉంటే వారిని బాలల సంరక్షణ కేంద్రాలకు చేర్చి చదివిస్తారు. పక్కా ప్రణాళికతో ఆపరేషన్ ముస్కాన్ జిల్లాలో బాలకార్మికుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడానికి వివిధ శాఖల ఆధ్వర్యంలో అధికారులు పక్కా ప్రణాళికను రూపొందించారు. ఎక్కడైనా 18ఏళ్ల లోపు ఉన్న పిల్లలు పని చేస్తున్నట్టు తెలిస్తే అక్కడికి వెళ్లి వారికి విముక్తి కల్పిస్తున్నారు. వారి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. అనాథ పిల్లలను, ఇతర రాష్ట్రాల నుండి వచ్చే పిల్లలను బాలల సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు.

మూడేళ్లలో 138 మందికి విముక్తి

జిల్లాలో ప్రతి సంవత్సరం జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని నిర్వహించి బాల కార్మికులకు విముక్తి కల్పిస్తున్నారు. 2021లో 39 మందికి, 2022లో 51 మందికి, 2023 సంవత్సరంలో 48 మంది బాల కార్మికులను గుర్తించి విముక్తి కల్పించారు. ఈ సారి కూడా సీపీ అనురాధ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో మూడు బృందాలుగా ఏర్పడి జిల్లాలోని పరిశ్రమల్లో, ఇటుక బట్టీల్లో, భవన నిర్మాణాలలో ప్రత్యేక తనిఖీలు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ ఆపరేషన్ ముస్కాన్ జూలై 31 వరకు కొనసాగుతుంది. బాల కార్మికులతో పనిచేయించుకోనే యజమాన్యాలకు చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నారు.

జిల్లాలో వలస కార్మికులు ఎక్కువ

జిల్లాలో భవన నిర్మాణాలకు, రిజర్వాయర్ పనులకు, ఇతరాత్ర పనులకు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, బీహార్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి ఎక్కువగా కార్మికులు వలస వస్తున్నారు . జిల్లాకు వచ్చిన వలస కార్మికులు కుటుంబంతో సహా ఇక్కడే ఉంటున్నారు. వలస కార్మికుల పిల్లలు వారి తల్లిదండ్రులతో కలిసి వారితోపాటు పనులు చేయిస్తున్నారు. అధికారులు తనిఖీలకు వెళ్లినప్పుడు మాత్రం అప్రమత్తమవుతున్నారు. అధికారులు వెళ్లగానే మళ్లీ పనులు చేయిస్తున్నారు. బాల కార్మికులతో పనులు చేయించే యజమాన్యాలపై సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురి నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సారి ఈ ఆపరేషన్ ముస్కాన్‌తో అయిన మార్పు వస్తుందో వేచి చూడాల్సిందే.



ఆపరేషన్ ముస్కాన్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్నసీపీ అనురాధ

పదవి కాదు.. చేసిన పనులే శాశ్వతం

- చిన్నకోడూరు మండల సర్వసభ్య సమావేశంలో హరీశ్‌రావు

8 లో

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ మను చౌదరి



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 1 : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ మనుచౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన స్వీకరించి మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించాలన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరగా పరిష్కరలించాలని ఆదేశించారు. మొత్తం 58 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, వివిధ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మా స్కూల్‌కు టీచర్లను నియమించండి

మద్దూర్‌లో ఉన్న ఇంగ్లీష్, ఉర్దూ మీడియం స్కూళ్లకు టీచర్లను నియమించాలని మసీద్ కమిటీ అధ్యక్షుడు షకీల్ షరీఫ్, ఆజాద్, ఆషాన్, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తాము ప్రతి నెలా రూ. 50 వేలు ఖర్చు పెట్టి విద్యావాలంటీర్ల ద్వారా పిల్లలకు విద్యను అందిస్తున్నామని తెలిపారు. వీలైనంత త్వరగా ఉపాధ్యాయులను పంపించాలని వారు కోరారు.



ల్యాండ్ సర్వేకు రావడం లేదు



\- బీర్ల సిద్ధయ్య

నాకు చేర్యాలలో 848 సర్వే నంబర్‌లో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి పట్టా పుస్తకంలో ఉంది. కబ్జాలో 3.30 ఎకరాలు మాత్రమే ఉంది. సర్వే చేయాలని మండల సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకున్నా భూ రికార్డులు అందుబాటులో లేవని దరఖాస్తును తిరస్కరించారు. జిల్లా సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకున్నా భూ రికార్డులు అందుబాటులో లేవని తిరస్కరించారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.



మా ఊరిని పంచాయతీగా మార్చాలి

\- లచ్చపేట వాసులు

దుబ్బాక మండలంలోని లచ్చపేట గ్రామాన్ని దుబ్బాక మున్సిపాలిటీలో కలిపారని, దీనివల్ల నిరుపేదలైన వారికి ఉపాధి లేకుండా పోయిందని లచ్చపేటకు వాసులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామీణ ఉపాధిహామీ సైతం రద్దు చేయబడిందని ఎలాంటి ఉపాధి లేక ఇబ్బందులకు గురవుతున్నామని వారు తెలిపారు. గ్రామాన్ని మళ్లీ గ్రామపంచాయతీగా మార్చాలని వారు డిమాండ్ చేశారు.

మా దేవుడు మీరే మాస్టారూ!

- బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను వెళ్లొద్దంటూ బతిమాలిన విద్యార్థులు
- కంటతడిపెట్టిన గురువులు



ఉపాధ్యాయులను వెళ్లనీయకుండా అడ్డుకుని రోదిస్తున్న ఆకునూరు ఎంపీపీఎస్ విద్యార్థులు

చేర్యాల/సిద్దిపేటక్రైం, జూలై 1: "సార్, మేడం మీరు ఎక్కడికీ వెళ్లొద్దు. మాతోనే ఉండాలి. మమ్మల్ని మీ సొంత పిల్లల్లా చూసుకుంటూ పాఠాలు చెప్పారు. చదువు విలువ నేర్పించారు. మీరే మాకు పాఠాలు చెప్పాలి. మీరు లేని బడికి ఇక మేమూ రాబోము" అంటూ విద్యార్థులు కన్నీరుమున్నీరుగా విలపించిన ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎంపీపీఎస్), సిద్దిపేట పట్టణంలోని కాళ్లకుంట కాలనీ ప్రాథమిక పాఠశాలలో జరిగింది. ఆకునూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం నందిటి సులోచన, ఉపాధ్యాయులు రాజయ్య, బుచ్చయ్య, ఇంద్రసేనారెడ్డి, భాస్కర్, కామిడి రత్నమాల తదితరులు ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియలో భాగంగా ఇతర పాఠశాలలకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించగా విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కూడా తరలివచ్చారు. ఇక నుంచి తమ అభిమాన ఉపాధ్యాయులు పాఠశాలకు రారన్న విషయాన్ని గ్రహించిన విద్యార్థులంతా వారిని పట్టుకొని బోరున విలపించారు. "మీరు వెళ్లొద్దు సార్" అంటూ బతిమిలాడారు. చిన్నారుల రోదనలకు చలించిన ఉపాధ్యాయులు కన్నీటి భాష్పాలు రాల్చారు. దాంతో ఎనిమిదేళ్లుగా పెనవేసుకున్న గురుశిష్యుల అనుబంధం అక్కడ వెల్లివిరిసింది. అనంతరం... వృత్తిగత జీవితంలో బదిలీలు తప్పవని, తాము అందుబాటులోనే ఉంటామని, ఎప్పుడు అవసరపడినా పాఠాలు చెబుతామని పిల్లలకు ధైర్యం చెప్పారు. ఏఏపీఎస్ చైర్మన్ తోళ్ల రాజేశ్వరి ఉపాధ్యాయులను సత్కరించారు.



కాళ్లకుంట కాలనీ ప్రాథమిక పాఠశాలలో టీచర్‌ను పట్టుకుని ఏడుస్తున్న విద్యార్థులు

వెక్కివెక్కి ఏడ్చిన విద్యార్థులు

సిద్దిపేటలోని కాళ్లకుంట కాలనీ ప్రాథమిక పాఠశాలలో 12 ఏళ్ల నుంచి జయశ్రీ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. సీనియర్ టీచర్ కావడంతో ఆ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా బాధ్యతలు తీసుకున్నారు. ఆ పాఠశాల విద్యార్థులతో, అక్కడి కాలనీవాసులతో అవినాభావ సంబంధం ఏర్పడింది. జయశ్రీ వేరే పాఠశాలకు బదిలీ అయ్యారు. తమకు ఎన్నో ఏళ్లుగా చదువు చెప్పిన గురువు బదిలీ కావడంతో విద్యార్థులు టీచర్‌పై పడి వెక్కివెక్కి ఏడ్చారు. విద్యార్థులకు సర్ది చెప్పిన ఆమె భావోద్వేగంతో వెళ్లిపోయారు. ఈ సంఘటన చూసిన కాలనీవాసులు కూడా కంట తడి పెట్టారు.





ఎంఆర్ఎఫ్ యాజమాన్యం సీఎస్ఆర్ కింద సరఫరా చేసిన ఫ్రీజర్లు, వైకుంఠ రథాలు

సీఎస్ఆర్ కింద వైకుంఠరథాలు, ఫ్రీజర్లు

అందజేసిన ఎంఆర్ఎఫ్ యాజమాన్యం

త్వరలో కేటాయించనున్న యంత్రాంగం

సంగారెడ్డి అర్బన్, జూలై 1 : ఎంఆర్ఎఫ్ యాజమాన్యం సీఎస్ఆర్ కింద సహాయ, సహకారాలు అందించేందుకు తన వంతుగా కృషి చేస్తున్నది. ఇప్పటికే జిల్లాకు మార్చి నెలలో నాలుగు అంబులెన్స్ వాహనాలను అందించిన విషయం తెలిసిందే. అయితే తాజాగా వైకుంఠరథాలు, ఫ్రీజర్లు అందించేందుకు ముందుకొచ్చింది. మనిషి మరణించిన తర్వాత శవాన్ని భద్రపరిచేందుకు వీలుగా ఉపయోగించే ఫ్రీజర్ బాక్సులను సరఫరా చేసింది. అదే విధంగా మరణించిన పార్థివదేహాన్ని అంత్యక్రియల కోసం వైకుంఠధామాలకు తీసుకెళ్లేందుకుగాను ప్రత్యేకంగా వైకుంఠరథం ట్రాలీలను కూడా సమకూర్చింది. అయితే ఫ్రీజర్ బాక్సులు ఎనిమిది, పార్థివదేహాన్ని తరలించే ఎనిమిది వైకుంఠ రథం ట్రాలీ వాహనాలను ప్రస్తుతం జిల్లా కేంద్రానికి సరఫరా చేశారు. త్వరలో జిల్లాలోని మున్సిపాలిటీ, లేదా గ్రామాలకు కేటాయించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.



రైతు అభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న అంబికాసోని



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ జిల్లా వ్యవసాయాధికారి

రైతుల సూచనలను పరిగణలోకి తీసుకుంటాం

● అర్హులందరికీ 'రైతు భరోసా' ఆర్థిక సాయం

● సంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి అంబికా సోని

జోగిపేట/వట్‌పల్లి/నారాయణఖేడ్, జూలై 1: రైతుల సూచనలు, సలహాల మేరకే రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా వ్యవసాయాధికారి అంబికా సోని పేర్కొన్నారు. అందోలు, వట్‌పల్లి, నారాయణఖేడ్ ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రైతుల అభిప్రాయసేకరణ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. వ్యవసాయం చేసుకునేందుకు రైతులకు సాయం అందజేయడానికే ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగానే పథకాన్ని రూపొందించాలనేందే ప్రభుత్వ అభిమతమని, అందుకే ప్రతీ మండలంలోనూ సదస్సులను ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నామని తెలిపారు. ఈ నెల 4 వరకు రైతు అభిప్రాయాలు తెలుసుకునేందుకు రైతులతో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం సేకరించిన వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కాగా, రైతు భరోసా పథకం కేవలం 10 ఎకరాలకే పరిమితం చేయాలని రైతులు సూచించారు. కౌలుదారులకు కూడా రైతు భరోసా అందజేయాలని కొందరు సూచించారు.

అందోలులో నిర్వహించిన కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ శేరి జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ డేవిడ్, సీడీసీ మాజీ డైరెక్టర్ ఎం. జగన్మోహన్ రెడ్డి, డివిజన్ వ్యవసాయాధికారి అరుణగౌడ్, ఏఈవో విజయరత్న, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశం, కౌన్సిలర్ హరికృష్ణాగౌడ్, రైతులు తోట్ల లక్ష్మణ్, మల్లేశం, మహేశ్, గోపాల్, నాగరాజు, పీఏసీఎస్ సీఈవోలు నర్సింహులు, భరత్, కారోబార్ అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వట్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్, కార్యదర్శి శ్రీకాంత్, ఏవో మహేష్ చౌహాన్, ఏఈవో పరిమిళ పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సహకార సహాయ రిజిస్ట్రార్ చిన్నారు, పీఏసీఎస్ చైర్మన్ శోభారాణి అశోక్‌రెడ్డి, ఏఈవో రాందాస్, శేషగిరిరావు, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో...

పాపన్నపేట/శివ్వంపేట; జూలై 1: రైతు భరోసా పథకం ద్వారా రైతులకు చేయూత లభిస్తుందని మెదక్ జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ అన్నారు. రైతు భరోసా పథకంపై అభిప్రాయ సేకరణలో భాగంగా సోమవారం పాపన్నపేట, కొత్తపల్లి సొసైటీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆయన వెంట కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్‌గుప్తా, ఏవో నాగం కృష్ణ, సొసైటీ డైరెక్టర్లు, ఏఈవోలు ఉన్నారు.

అలాగే, శివ్వంపేట సహకార సంఘంలో చైర్మన్ వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు భరోసా అభిప్రాయ సేకరణలో ఎంపీపీ హరికృష్ణ, డీసీఏవో కరుణాకర్, ఏవో లావణ్య, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, సీఈవో మధు యాదవ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

● బీవీఆర్ఐటీ కాలేజ్ బస్సు సీజ్, డ్రైవర్ రిమాండ్

సంగారెడ్డి క్రైం, జూలై 1 : విద్యా సంస్థల యాజమాన్యాలు డ్రైవర్లకు ముందస్తుగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించిన తర్వాతనే విధుల్లోకి తీసుకోవాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచించారు. సంగారెడ్డి, పటాన్‌చెరులో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సుమన్, లాలూనాయక్‌ల ఆధ్వర్యంలో సోమవారం తమ సిబ్బందితో కలిసి విద్యా సంస్థలకు చెందిన బస్సు డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి బస్సు నడిపిన బీవీఆర్ఐటీ కళాశాల బస్సు (టిఎస్ 02 యుఎ 6591) డ్రైవర్ ఇస్సాక్ అహ్మద్(45)ను సోమవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ రూపేష్ తెలిపారు. బస్సును సీజ్ చేయడంతో ఆపటు నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వివరించారు. అలాగే, సంగారెడ్డి, పటాన్‌చెరు, అమీన్‌పూర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు సోమవారం నాడు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన పది మందిని కోర్టు హాజరుపరిచారు. సంగారెడ్డికి చెందిన ఆరుగురు, పటాన్‌చెరు, అమీన్‌పూర్‌కు చెందిన ఇద్దరి చొప్పున మొత్తం పది మందికి 1,2 రోజుల జైలు శిక్ష విధిస్తూ మార్నింగ్ కోర్టు మెజిస్ట్రేట్ షకీల్ అహ్మద్ సిద్దిక్ సోమవారం తీర్పు చెప్పారని జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపారు.



కాలేజీ బస్సు డ్రైవర్‌కు పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు

అంతర్జాతీయ వర్క్‌షాప్, సదస్సులకు

గీతం అధ్యాపకులు



సదస్సులో పాల్గొన్న గీతం అధ్యాపకులు

పటాన్‌చెరు రూరల్, జూలై 1 : ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో పాల్గొని, ఉపన్యసించడానికి గీతం, హైదరాబాద్‌లోని ఆంగ్లం, ఇతర భాషల విభాగం అధిపతి డాక్టర్ సయంతన్ మండల్, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జోంధాలే రాహుల్ హీరామన్లు విదేశాలకు బయలుదేరివెళ్లారు. ఫ్రాన్స్ లోని నాటింగ్హామ్ ట్రెంట్ యూనివర్శిటీ పోస్ట్‌కలోనియల్ అండ్ గ్లోబల్ స్టడీస్ రీసర్చ్ గ్రూప్, యూనివర్సిటీలోని పరిశోధనా కేంద్రం ఎమ్మో (ఈఎంఎంఏ) ఆధ్వర్యంలో జూన్ 27, 28న నిర్వహించిన బంగ్లా, మరాఠీ దళితపక్ష పత్రికల వర్క్‌షాప్‌లో ప్రసంగించడానికి డాక్టర్ సయంతన్ మండల్, డాక్టర్ జోంధాలే రాహుల్ హిరామన్ పాల్గొన్నారు. వారిద్దరూ 2022 నుంచి బంగ్లా, మరాఠీ దళిత పీరియాడికల్స్‌పై కొనసాగిస్తున్న పరిశోధనను యూకే ఆధారిత పీహెచ్ స్కాలర్లకు పరిచయం చేశారు. అనంతరం యునైటెడ్ కింగ్‌డమ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్‌లో జులై 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్న గ్లోబల్ బుక్ కలర్స్ మెటీరియలిటీస్, కొలాబరేషన్, యాక్సెస్ అనే పేరుతో సొసైటీ ఫర్ ది హిస్టరీ ఆఫ్ ఆథర్షిప్, రీడింగ్, అండ్ పబ్లిషింగ్ 2024 సదస్సులో డాక్టర్ సయంతన్, డాక్టర్ రాహుల్ ఉపన్యసించనున్నారు.

ఎంఎన్ఆర్ క్యాంటీన్లలో తనిఖీలు

సంగారెడ్డి రూరల్, జూలై 1 : సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులోని ఎంఎన్ఆర్ మెడికల్ కళాశాలలో గల క్యాంటిన్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు, మొబైల్ ప్రయోగశాల అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. క్యాంటిన్‌లోని వంట గది, ఆహార పదార్థాలు, పిండి వంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిటికీలకు జాలీలు లేవని, కూరగాయలు నిలువ చేసే ప్రాంతంలో కింద వుండే టైల్స్ ధ్వంసమై గుంత ఏర్పడి వాటిలో నీరు చేరి ఉందని, కొన్ని కూరగాయలు కుళ్లిపోయి ఉన్నాయని, వంటగది ఆవరణలో అపరిశుభ్రంగా వున్నదని పేర్కొన్నారు.

ఎంఎన్ఆర్ యూనివర్సిటీని రద్దు చేయండి: ఏబీవీపీ

ఎంఎన్ఆర్ యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి కురుమ మహేష్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులోని ఎంఎన్ఆర్ విద్యాసంస్థ వద్ద సోమవారం ఏబీవీపీ నాయకులు ధర్నా నిర్వహించి మాట్లాడారు.

వెల్దుర్తిలో దొంగల హల్‌చల్

● వైన్స్‌షాపు, మరో మూడు దుకాణాల్లో చోరీకి యత్నం

● వెల్దుర్తి శివారులో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



గోడకు కన్నం వేసిన వైన్స్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

వెల్దుర్తి, జూలై 1 : మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఆదివారం రాత్రి దొంగలు హల్‌చల్ సృష్టించారు. వివరాల్లోకి వెళితే.. వెల్దుర్తి పట్టణంలోని తిరుమల వైన్స్ వెనుక భాగం గోడకు కన్నం వేసి రూ.31 వేల నగదు, రూ.59 వేల విలువైన మద్యం బాటిళ్లను అపహరించారు. దీంతో పాటు దుకాణంలో ఉన్న సీసీ కెమెరాల మానిటర్‌ను ధ్వంసం చేసి హర్డ్ డిస్క్‌పై దుకాణంలోని మద్యంను పోసి తగులబెట్టారు. అలాగే పట్టణంలోని మొబైల్, కిరాణ దుకాణం, అయ్యంగారి బేకరీ చోరీకి యత్నించారు. గ్రామ శివారులోని రైతువేదిక వెనుక భాగంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైర్లను అపహరించారు. తూప్రాన్ సీఐ రంగకృష్ణ, వెల్దుర్తి ఎస్‌ఐ నవతగౌడ్ వైన్స్‌ను పరిశీలించారు. మెదక్ క్లూస్ టీమ్ సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించాయి. వైన్స్ యాజమాని బుర్ర సురేష్‌గౌడ్, రైతు పెంటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు దొంగల రిమాండ్

● బంగారం..నగదు స్వాధీనం



నిందితులను చూపుతున్న పోలీసులు

పాపన్నపేట, జూలై 1 : కిరాణ దుకాణంలో జరిగిన చోరీకి సంబంధించి ఇద్దరు దొంగలను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నట్లు మెదక్ రూరల్ సీఐ కేశవులు, పాపన్నపేట ఎస్‌ఐ తెలిపారు. పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టేక్మాల్ మండలం ఎల్లంపల్లి తండాకు చెందిన దేవసోత్ రాజు అలియాస్ బట్టు, దేవసోత్ రాజు అప్పుడపుడు చోరీలకు పాల్పడేవారు. ముందుగా వేసుకున్న పథకంలో భాగంగా గత నెల 24న రాత్రి 12 గంటల ప్రాంతంలో పాపన్నపేటలోని వీరభద్ర కిరణాం వెనుక గోడకు గునపంతో కన్నం వేశారు. దేవసోత్ రాజు బయట గస్తీ కాస్తుండగా, బట్టు కన్నం నుంచి లోపలికి దూరాడు. ముందుగా గునపంతో కౌంటర్‌ను ధ్వంసం చేసి అందులో ఉన్న నగదు, బంగారం, వెండి వస్తువులతో పాటు, ఎల్‌ఈడి టీవీ, డీవీఆర్ తీసుకొని వెళ్లాడు. ఈ క్రమంలో వెంట తెచ్చుకున్న గునపాన్ని, బ్లూటూత్ ఇయర్ ఫోన్ అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల రికార్డు, ఘటనా స్థలంలో లభ్యమైన నిందితుడి బ్లూటూత్ ఇయర్‌ఫోన్, డీవీఆర్ ద్వారా ఇద్దరిని నిందితులుగా గుర్తించారు. సోమవారం ఉదయం అరెస్టు చేసి విచారణ చేసి, పదిన్నర తులాల బంగారు నగలు, రెండు తులాల వెండి నాణేలు, రూ.14 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వారు గతంలో పలు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు గుర్తించారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ నరేష్, కానిస్టేబుల్‌లను సీఐ అభినందించారు.

టూరిస్టు బస్‌లో డ్రగ్స్ తరలింపు

● గోవా నుంచి హైదరాబాద్ వస్తుండగా ప్రయాణికుడి వద్ద పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

● రూ.1.21 లక్షల విలువైన 1.76 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం



డ్రగ్స్ తరలిస్తున్న నిందితుడిని అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

జహీరాబాద్, జూలై 1 : టూరిస్టు బస్సులో డ్రగ్స్ తరలిస్తుండగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని చిరాగ్‌పల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద సోమవారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీల్లో పట్టుబడింది. ఎక్సైజ్ సీఐ. శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎంహెచ్12 డబ్ల్యూజే 1334 నంబర్ గల టూరిస్టు బస్సు గోవా నుంచి హైదరాబాద్‌కు వస్తుంది. చిరాగ్‌పల్లి బార్డర్ చెక్‌పోస్టు వద్ద బస్సును ఆపిన ఎక్సైజ్ పోలీసులు తనిఖీ చేయగా బస్సులో ప్రయాణిస్తున్న ఈదర జయంత్ వద్ద 1.76 గ్రాముల ఎండీఎంఏ అనే డ్రగ్స్‌ను పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ.1.21లక్షల పైచిలుకు ఉంటుందని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.. ఈ మేరకు డ్రగ్స్‌ను, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. ఈ తనఖీల్లో సీఐలు శంకర్, మల్లికార్జున్‌బాబు, ఎస్‌ఐలు రమేష్, అనుదీప్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

3 వేల కేజీల నల్లబెల్లం పట్టివేత

● వాహనం సీజ్, బెల్లం, మొబైల్ ఫోన్ స్వాధీనం



పట్టుబడిన నల్లబెల్లం, నిందితుడితో పోలీసులు

మునిపల్లి, జూలై 1 : కర్ణాటక రాష్ట్రం నుంచి 3000 కేజీల నల్లబెల్లాన్ని తరలిస్తుండగా సంగారెడ్డి జిల్లా మునిపల్లి కంకోల్ టోల్‌ప్లాజా వద్ద సోమవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు పట్టుకున్నారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. మహబూబాద్ జిల్లా కేసముద్రం ముత్యాలమ్మ తండాకు చెందిన గుగులోత్ రమేష్ కర్ణాటక రాష్ట్రం మన్నెక్కెల్లి నుంచి కేసముద్రంకు నల్లబెల్లాన్ని బొలెరో వాహనంలో తరలిస్తున్నట్లు సమాచారం అందింది. పోలీసులు అప్రమత్తమై కంకోల్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా నల్లబెల్లాన్ని తరలిస్తున్న వాహనం పట్టుబడింది. వాహనాన్ని సీజ్ చేసి, నల్లబెల్లం, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వాహనం రూ.4లక్షలుతో పాటు నల్లబెల్లం రూ.2లక్షలు.. మొత్తం రూ.6 లక్షలు విలువ ఉంటుందని తెలిపారు. ఈ తనిఖీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రావు, సీఐ గాంధీనాయక్, ఎస్‌ఐ యాదయ్య, హెడ్ కానిస్టేబుల్ ఎండీ అలీం, కానిస్టేబుళ్లు వివేక్, మల్కయ్య, ఉమారాణి, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల పదోన్నతులు, బదిలీలు పూర్తి

● సిద్దిపేట జిల్లాలో 622 మందికి పదోన్నతి

● 1,032 మంది టీచర్లు బదిలీ



బదిలీలో ప్రక్రియలోనే టీచర్ల రేషనలైజేషన్

సిద్దిపేట క్రైం/సంగారెడ్డి అర్బన్, జూలై 1 : ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ఎట్టకేలకు ముగిసినది. ఎన్నో సంవత్సరాల నుంచి వేచి చూస్తున్నా టీచర్లకు ఊరట లభించింది. 2018 సంవత్సరంలో ప్రభుత్వం కేవలం ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియనే చేపట్టగా, పదోన్నతులు ఇవ్వలేదు. గతేడాది ప్రభుత్వం టీచర్ల పదోన్నతులు, బదిలీల నోటిఫికేషన్ వేసినప్పటికీ కోర్టు కేసుతో మధ్యలోనే నిలిచిపోయింది. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం గత నెల 8వ తేదీన మధ్యంతరంగా ఆగిపోయిన టీచర్ల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి 23 రోజుల పాటు కొనసాగింది. ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ ఆగుతుందా, సాగుతుందా అన్న సందేహాల మధ్య ప్రక్రియ సజావుగా ముగియడంతో విద్యాశాఖ అధికారులు, టీచర్లు అంతా ఊపిరిపీల్చుకున్నారు.

ప్రభుత్వ ఆదేశానుసారం

అధికారులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం టీచర్ల పదోన్నతులు పూర్తయిన తర్వాతనే బదిలీల ప్రక్రియ చేపట్టారు. సిద్దిపేట జిల్లాలో 1,920 మంది స్కూల్ అసిస్టెంట్ టీచర్లు, 1,990 సెకండరీ గ్రేడ్ టీచర్లు, పండితులు, పీఈటీలతో సహా మొత్తం 4,135 మంది టీచర్లు పనిచేస్తున్నారు. వీరిలో 622 మంది ఉపాధ్యాయులకు పదోన్నతి లభించింది. 1,032 మంది బదిలీలో భాగంగా స్థానచలనం చెందారు.

ఈ సారి ప్రభుత్వం టీచర్ల బదిలీల ప్రక్రియలోని రేషన్‌లైజేషన్‌ను చేపట్టింది. పాఠశాలలో ఒకటి నుంచి పదిమంది విద్యార్థులు ఉంటే ఒక ఉపాధ్యాయుడు, 11 నుంచి 40 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులు, 41 నుంచి 60 మంది విద్యార్థులు ఉంటే ముగ్గురు ఉపాధ్యాయులు, 61 పైన విద్యార్థులు ఉంటే ఆ పాఠశాలలో ఎన్ని పోస్టులు ఉంటే అన్ని పోస్టులను భర్తీ చేసే విధంగా వెబ్ ఆప్షన్స్‌ను సెట్ చేశారు. తదనుగుణంగా జిల్లాలో చాల పోస్టులను ఒక్కసారిగా వెబ్ ఆప్షన్స్‌లో పోస్టులు బ్లాక్ చేయడంతో ఎస్జీటీ ఉపాధ్యాయులు అయోమయానికి గురయ్యారు. ఎస్జీటీ ఉపాధ్యాయులకు వెబ్ ఆప్షన్స్‌కు శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి 10 గంటల వరకు అవకాశం ఇచ్చారు. సోమవారం ఉదయం నుంచి బదిలీకి అప్లై చేసుకున్న ఉపాధ్యాయులకు ఉత్తర్వులు విడుదలయ్యాయి.

పదోన్నతులలో ఎస్జీటీలకు నిరాశ

ఉపాధ్యాయ పదోన్నతుల్లో అన్యాయం జరిగిందని ఎస్జీటీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉమ్మడి సీనియార్టీ ప్రకారం పదోన్నతులు ఇచ్చేవారు ఈసారి కోర్టు తీర్పు ప్రకారం.. భాషా పండితుల పదోన్నతుల పోస్టులను ఉమ్మడి సీనియార్టీగా కాకుండా కేవలం పండితులకు ఇవ్వడంతో ఎస్జీటీ ఉపాధ్యాయులు నిరాశకు గురయ్యారు. అదే విధంగా ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పదోన్నతి పోస్టును ఉమ్మడి సీనియార్టీ ప్రకారం కాకుండా టీటీసీ పూర్తి చేసిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు మాత్రమే ఇవ్వడంతో బీఈడీ చేసిన ఎస్జీటీ ఉపాధ్యాయులు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పాఠశాలలో తన జూనియర్ ఉపాధ్యాయుడికి పదోన్నతి వచ్చి సీనియర్ ఉపాధ్యాయుడికి రాకపోతే జూనియర్ కింద ఏవిధంగా పనిచేయాలని వాపోతున్నారు.

సంగారెడ్డి జిల్లాలో చివరగా 1433 మంది ఎస్జీటీల బదిలీలు

సోమవారం జరిగిన సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలతో ఆ ప్రక్రియకు తెరపడింది. సంగారెడ్డి జిల్లాలో చివరి దశగా ప్రభుత్వ, లోకల్‌బాడీ యాజమాన్య పరిధిలో ఎస్జీటీల బదిలీల్లో భాగంగా 1904 మంది బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. అందులో 1433 మంది బదిలీ అయ్యారు. ఉత్తర్వులు అందుకున్న ఎస్జీటీలు పాత పాఠశాలలో రిలీవ్ అయి కొత్త పాఠశాలలో విధుల్లో చేరారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన బాలుడు

సంగారెడ్డి అర్బన్, జూలై 1 : మూడు రోజుల క్రితం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలో కుక్కల దాడిలో ఎనిమిదేళ్ల బాలుడు మృతిచెందగా, ఏడు నెలల చిన్నారికి గాయాలైన సంఘటన మరువకముందే జిల్లాలో మరో ఘటన చోటుచేసుకున్నది. సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధి మంజీర హస్పిటల్ సమీపంలోని శ్రీనగర్ కాలనీలో తన ఇంటి వద్ద ఆరేళ్ల బాలుడు ఆడుకుంటుండగా వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు బాలుడిని వెంటనే బైపాస్ రోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. సంగారెడ్డి పట్టణంలో వీధికుక్కల స్వైరవిహారం చేస్తున్నా సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని కుటుంబసభ్యులు ఆరోపించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి జిల్లాలో కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

చేర్యాలలో పలువురికి గాయాలు

చేర్యాల, జూలై 1 : చేర్యాల పట్టణంలోని మాల కమ్యూనిటీహాల్ సమీపంలో కుక్కలుదాడి చేసిన సంఘటనలో కాలనీకి చెందిన పలువురు తీవ్రగాయాలపాలయ్యారు. సోమవారం సాయంత్రం వేళ నడుచుకుంటూ వెళుతున్న బుచ్చమ్మ, రేణుక, సుల్తానా, హరిప్రియ, ప్రశాంత్‌లపైకి కుక్కలు దూసుకెళ్లి కరిచాయి. వారికి గాయాలవగా చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలివెళ్లారు. వీరిలో ఒకరికి తీవ్రంగా గాయాలవడంతో సిద్దిపేటకు తరలించారు.

మట్టి కూలడంతో మహిళ మృతి



శ్యామల(ఫైల్)

కౌడిపల్లి, జూలై 1: మహిళపై మట్టిపెళ్లలు పడి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని బుజరంపేట్‌లో ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంది బోరంచ, శ్యామలతో వారి పాటు కుమారుడు కలసి అదే గ్రామ శివారులోని నేరేడు చేరువులో మట్టి తీసేందుకు వెళ్లారు. మట్టిని తవ్వుతుండగా భర్త బోరంచ, కుమారుడు నీరు తాగేందుకు వెళ్లగా మట్టి గడ్డ తలపై పడటంతో ఊపిరాడకు శ్యామల అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కౌడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఎదురెదురుగా వస్తున్న రెండు డీసీఎంలు ఢీ

చిన్నశంకరంపేట, జూలై 1 : చిన్నశంకరంపేట మండలం సోమవారం ఉదయం ఎదురెదురుగా రెండు డీసీఎంలు ఢీకొన్న సంఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. చేగుంట నుంచి గవ్వలపల్లి వైపు వెళ్తున్న డీసీఎం ఎదురుగా వస్తున్న డీసీఎంను ఢీకొట్టగా ముందు భాగం అద్దాలు ధ్వంసమయ్యాయి.

సమర్థవంతమైన పాలనే లక్ష్యం

● అధికారులు సమయపాలన పాటించాలి

● సమావేశాల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు నిషేధం

● ఈ - ఆఫీస్ ద్వారా అన్ని శాఖల ఫైల్స్

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ అర్బన్, జూలై 1: మెదక్ జిల్లాలో సమర్థవంతమైన పాలనే లక్ష్యమని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలంటే మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడానికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. పర్యటనలు ప్రత్యేక ప్రొఫార్మా ఇవ్వనున్నట్లు, మంగళవారం సాయంత్రం వరకు ప్రొఫార్మా నింపి అందించాలన్నారు. కలెక్టర్ కార్యాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. వాటర్ బాటిళ్ల ద్వారా నీటి సరఫరా చేయకుండా ప్రత్యేక వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ-ఆఫీస్ విధానాన్ని ప్రవేశపెడుతున్నందు ప్రతి ఫైల్ కూడా దీని ద్వారా స్కాన్‌చేసి భద్రపరుస్తామని తెలిపారు. నూతన ఫైల్స్ కూడా ఈ-ఆఫీస్ ద్వారానే రావాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏవో యూనస్, వివిధ శాఖల అధికారులు శ్రీరామ్, శ్రీనివాసరావు, బ్రహ్మాజీ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కాల్వ చక్రధర్



సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

సిద్దిపేట టౌన్, జూలై 1 : వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (3194) సెంట్రల్ యూనియన్ ఆదేశాల మేరకు సోమవారం కలెక్టర్ మనుచౌదరి, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కాల్వ చక్రధర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో ఈసీఏఎన్ఎంలుగా యూరోపియన్ కమిషన్ స్కీమ్ కింద ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, వారిని క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. 20 ఏళ్ల క్రితం డీఎస్సీ ద్వారా ఎంపికై ఆర్వోఆర్ ద్వారా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ఇప్పటివరకు క్రమబద్ధీకరించకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చెరుకు భాస్కర్, కోశాధికారి గూడూరు స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, భూంపల్లి రాజు, మహిళా ప్రెసిడెంట్ శోభ తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపుపై ప్రత్యేక దృష్టి

● తూప్రాన్‌లో ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

● వివరాలు వెల్లడించిన ఎస్పీ డాక్టర్ బాలస్వామి



దొంగలను చూపుతున్న ఎస్పీ బాలస్వామి

తూప్రాన్, జూలై 1: జిల్లాలో నేరాల అదుపుపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి పేర్కొన్నారు. సోమవారం తూప్రాన్ డీఎస్పీ కార్యాలయంలో ఇద్దరు దొంగల అరెస్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తూప్రాన్, నర్సాపూర్‌లో ఇటీవల బెదిరింపులకు పాల్పడి దోపిడీ చేసిన విషయంలో విచారణ జరుగుతుందన్నారు. వాహనాలకు నంబర్లు ప్లేట్లు లేకుండా వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్దశంకరంపేటలో 12 వాహనాలు సీజ్ చేసినట్లు చెప్పారు. అధికవడ్డీ వసూళ్లకు పాల్పడుతున్న వ్యాపారులకు కౌన్సెలింగ్ నిర్వహించామని పేర్కొన్నారు. బైక్ ఫైనాన్స్‌లపై దృష్టి సారిస్తామని ఎస్పీ తెలియజేశారు. ఈ సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ సామ వెంకట్‌రెడ్డి, సీఐ రంగకృష్ణ, తూప్రాన్ ఎస్‌ఐ యాదగిరి పాల్గొన్నారు.

12 బైక్‌లు స్వాధీనం

ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ బాలస్వామి వివరించారు. సోమవారం తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లి చౌరస్తా వద్ద వాహన తనిఖీలు చేయగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తూప్రాన్ వైపు వస్తుండగా పట్టుకొని విచారించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి 12 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మక్త షైలారం గ్రామానికి చెందిన బురుగుపల్లి స్వామి(35), బురుగుపల్లి మల్లేశ్(35) బైక్ చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. 2012లో స్వామి గజ్వేల్ పోలీసుస్టేషన్ పరిధిలో బైక్ చోరీ చేసి జైలుకు వెళ్లినట్లు వివరించారు. మెదక్ జిల్లా తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు బైక్‌లు, మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు బైక్‌లు, సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు బైక్‌లు, ములుగు పోలీస్‌స్టేషన్, గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక్కొక్క బైక్ చోరీ చేసినట్లు ఎస్పీ బాలస్వామి తెలిపారు. మరో మూడు బైక్‌లకు సంబంధించిన యజమానుల వివరాలు తెలియాల్సి ఉందని ఎస్పీ పేర్కొన్నారు. 12 బైక్‌ల చోరీని ఛేదిండంలో మార్గదర్శకం చేసిన డీఎస్పీ సామ వెంకట్‌రెడ్డి, సీఐ రంగ కృష్ణలతోపాటు, కేసును ఛేదించిన తూప్రాన్ ఎస్‌ఐలు శివానందం, యాదగిరి, కానిస్టేబుళ్లు సురేష్, కృష్ణ, నాగేందర్‌బాబులను ఎస్పీ బాలస్వామి ప్రత్యేకంగా అభినందించారు.

బస్తీ దవాఖాన పనులను అడ్డుకున్న రియల్టర్లు

● ఎదురు తిరిగిన కాలనీ వాసులు

● అధికారుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ



కాలనీవాసులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

సంగారెడ్డి టౌన్, జూలై 1 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని సంజీవనగర్ ప్రధాన రహదారి పక్కన చేపట్టిన బస్తీ దవాఖాన నిర్మాణం పనులను సోమవారం ఓ రియల్టర్ అడ్డుకోవడంతో కాలనీవాసులు ఎదురు తిరిగి ఆందోళనకు దిగారు. దాదాపు రూ.10 కోట్ల విలువైన సర్కారుకు చెందిన ఖాళీ స్థలాన్ని తప్పుడు రికార్డులు సృష్టించి ఆక్రమించేందుకు ప్రయత్నించగా ఆ స్థలం వివాదాస్పదంగా మారిన విషయం తెలిసింది. ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుని బస్తీ దవాఖాన నిర్మించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.20 లక్షలతో ఓ కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. అయితే ఈ స్థలాన్ని తాను కొనుగోలు చేశానంటూ సోమవారం ఓ రియల్టర్ పనులను అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న సంజీవనగర్, మార్క్స్‌నగర్, నారాయణరెడ్డి కాలనీలకు చెందిన ప్రజలతో పాటు పలు దళిత సంఘాల నాయకులు రియల్టర్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేశారు. దీంతో సంగారెడ్డి తహసీల్దార్ దేవదాస్, డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మి అక్కడకు చేరుకొని కాలనీవాసులు, దళిత సంఘాల నాయకులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రియల్టర్ వద్ద సరైన ధ్రువపత్రాలు లేవని, ఈ స్థలం ప్రభుత్వానిదేనంటూ తేల్చారు. ఈ స్థలం కబ్జాకు గురికాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలుపడంతో గొడవ సద్దుమణిగింది.

ట్యాంకర్, స్కూటర్ ఢీ..

యువకుడి మృతి

● మెదక్ మండలం మాచవరం గేట్ వద్ద ఘటన



ప్రేమ్‌కుమార్(ఫైల్)

మెదక్ అర్బన్, జూలై 1: ట్యాంకర్ లారీ, స్కూటర్ ఢీ కొన్న ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం మెదక్ మండల పరిధిలోని మాచవరం గేట్ సమీపంలో చోటు చేసుకున్నది. రూరల్ పోలీసులు కథనం మేరకు.. టేక్మాల్ మండల పరిధిలో వేల్పుగొండ గ్రామానికి చెందిన నీరుడి ప్రేమ్‌కుమార్(19) కొంతకాలంగా హైదరాబాద్‌లో జీవిస్తున్నాడు. సోమవారం సొంత గ్రామానికి వెళ్తున్న క్రమంలో మాచవరం చెక్‌పోస్టు సమీపంలో ట్యాంకర్ లారీని ఓవర్‌టేక్ చేయబోయి వెనుక టైర్ కింద పడడంతో తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్‌ఐ వెంకటయ్య తెలిపారు.

‘మాకిచ్చే డబ్బు.. మా పిల్లలకైనా ఇవ్వండి’

● అప్పుడే మా ఆత్మ శాంతిస్తుంది

● మృతిచెందిన దంపతుల పేరిట ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన బంధువులు

● ధూళిమిట్ట మండల కేంద్రంలో ఘటన



ధూళిమిట్టలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ధూళిమిట్ట, జూలై 1 : ‘మేము తెలియజేయునది ఏమనగా నా ద్వారా కిరాణాషాపులో సరుకులు ఉద్దెర తీసుకున్న, చేతిబదులుగా డబ్బు తీసుకున్న వారికి విన్నపం.. దయచేసి తీసుకున్న ప్రతీ రూపాయిని మా పిల్లలకు అందచేసి మా ఆత్మలకు శాంతి చేకుర్చాలని కొరుకుంటున్నాం’ అంటూ చనిపోయిన తల్లితండ్రుల పేరిట సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండల కేంద్రంలో వారి బంధువులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే ధూళిమిట్టకు చెందిన తాడూరి కరుణాకర్, దివ్య దంపతులు తమకున్న కొద్దిపాటి వ్యవసాయంతో పాటు పాటు ఇంటి ముందు చిన్న కిరాణాషాపు ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తూ ఉండేవారు. వారికి శివ, శశి ఇద్దరు కుమారులున్నారు. అన్యోన్యంగా సాగిపోతున్న వారి జీవితంలో విషాదం నెలకొన్నది. నాలుగేళ్ల క్రితం వ్యవసాయబావి వద్ద ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి కరుణాకర్ మృతి చెందాడు. భర్త మృతితో తీవ్ర మనోవేదనలో ఉన్న దివ్య జీవనాధారం కోసం కిరాణషాపును నడుపుకుంటూ తన ఇద్దరు కుమారులను పోషించుకుంటుంది. అయితే కిరాణషాపుకు వచ్చిన వారిని కాదనకుండా కొంతమందికి దివ్య ఉద్దెరకు కూడా సరుకులు ఇచ్చేది. అలాగే కొంతమందికి చేతి బదులుగా డబ్బు కూడా సహాయం చేసేది. అయితే దివ్య ఆరోగ్యం కొన్ని రోజులుగా బాగాలేకపోవడంతో గత నెల మృతి చెందింది. తల్లిదండ్రి ఇద్దరి మృతితో పిల్లలు అనాథలయ్యారు. పిల్లలు ప్రస్తుతం నాన్నమ్మ తాత భారతమ్మ, నర్సయ్య, చినాన్న స్వామి సంరక్షణలో ఉంటున్నారు. అయితే తమ అన్నావదినలు బతికుండగా కిరాణషాపులో సరుకులు ఉద్దెర తీసుకున్నవారు, అలాగే కొంతమంది డబ్బు అప్పుగా తీసుకున్నవారు తిరిగిస్తే పిల్లల అవసరాలకు ఉపయోగపడుతాయనే కారణంతో గ్రామంలో పలు చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు స్వామి తెలిపాడు. అయితే ఈ ఫ్లెక్సీలను చూసినవారు అయ్యో పాపం అంటూ తమ సానుభూతిని తెలుపుతూ తీసుకున్నవారు తిరిగి ఇచ్చేయాలంటున్నారు.

పిల్లలకు నోట్‌బుక్‌లు అందజేసిన సీఐ

అనాథలైన శివ, శశిలను పోలీస్‌శాఖ తరఫున సహాయం చేయాలని సిద్దిపేట సీపీ డా.అనురాధ సూచించడంతో సోమవారం చేర్యాల సీఐ ఎల్.శ్రీను పిల్లల నానమ్మ, తాతతో మాట్లాడారు. చదువుల విషయంలో ఏ అవసరం ఉన్న తప్పకుండా సహాయం చేస్తామని వారికి హామీ ఇచ్చారు. పిల్లలకు ఎప్పుడు ఏ సహాయం కావాలన్నా తనను సంప్రందించాలని తెలిపారు. అనంతరం పిల్లలకు నోట్‌బుక్‌లు, పెన్నులు అందించి బాగా చదువుకుని ఉన్నత స్థానంలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మద్దూర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో ఎంపీటీసీల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

ప్రజాసేవకు పదవులే ముఖ్యం కాదు

గజ్వేల్, జూలై 1: ప్రజాసేవకు పదవులే ముఖ్యం కాదని శాసన మండలి సభ్యులు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ మండల ప్రజాపరిషత్ చివరి సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలను శాలువాలతో సత్కరించారు. ప్రజా సేవ చేయడానికి పదవులే ఉండాల్సిన అవసరం లేదని, ప్రజాసేవ చేయాలన్న తపన ఉంటే చాలన్నారు. ఎంపీటీసీ ఈ ఐదేళ్ల కాలంలో చేసిన సేవలు ప్రజలకు గుర్తుంటాయన్నారు. ఆయన వెంట ఎంపీపీ అమరావతి, జడ్పీటీసీ పంగ మల్లేశం, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ దయాకర్, వైస్‌ఎంపీపీ బెల్దే కృష్ణాగౌడ్, ఎంపీటీసీలు గొడుగు జ్యోతి స్వామి, అరిగే అశోక్‌కుమార్, ఆంజనేయులు, బూర్గుపల్లి రాజిరెడ్డి, దమ్మని రాజేశ్వరికిష్టయ్య, ఆకుల ఆనందం, నక్కీర్త గంగాధర్, ఎంపీడీవో సూపరింటెండెంట్ జయపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో అభివృద్ధి చేశాం: ఎంపీపీ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్నఎంపీపీ నిర్మల

బెజ్జంకి, జూలై 1: ప్రజల సహకారంతో గ్రామాల్లో ఎన్నో ప్రజోపయోగ పనులు చేపట్టి అభివృద్ధి చేశామని ఎంపీపీ నిర్మల పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నిర్మల అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం అధికారులు, నాయకులు ఎంపీపీ నిర్మలను, ఎంపీటీసీలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మప్ప, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పదవి కాదు.. చేసిన పనులే శాశ్వతం

- చిన్నకోడూరు మండల సర్వసభ్య సమావేశంలో హరీశ్‌రావు

చిన్నకోడూరు, జూలై 1: పదవి ఎవరికీ శాశ్వతం కాదని, పదవీ కాలంలో చేసిన పనులే శాశ్వతంగా నిలుస్తాయని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం చిన్నకోడూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరై మాట్లాడారు. ఐదేళ్ల గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయంతో కష్టపడి పని చేశారన్నారు. సాగునీరు ప్రజల జీవన గతిని, పల్లెల ముఖ చిత్రాన్ని మార్చుతుందన్నారు. అలాంటి సాగు నీటిని కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలను ఈ ఐదేళ్ల పదవీకాలంలో మీ గ్రామాలకు తెచ్చి ఏడాదికి రెండు పంటలు పండించే అదృష్టం మీకే దక్కిందన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని ఎంత చేసినా కొంత మిగిలే ఉంటుదన్నారు. మళ్లీ మంచి అవకాశాలు రావాలని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలిచి ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన సిద్దిపేట జిల్లాకు తొలి జడ్పీ చైర్‌పర్సన్‌గా తనకు అవకాశం దక్కడం అదృష్టమన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్, హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల4న జడ్పీ చైర్‌పర్సన్, ఎంపీటీసీల పదవీకాలం ముగియనుండటంతో వారిని సన్మానించారు.



జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ, ఎంపీటీసీలతో మాజీ మంత్రి హరీశ్‌రావు

విద్యుత్ అంతరాయంపై నిలదీత

పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యాశాఖ, ఐకేపీ, ఉపాధిహామీ, వ్యవసాయం, పశుసంవర్ధక, విద్యుత్‌శాఖల పని తీరుపై చర్చించారు. పచ్చి రొట్ట విత్తనాలు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఇతర జిల్లాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని సికింద్లాపూర్ ఎంపీటీసీ బాలయ్య ఏవో జయంత్‌కుమార్‌ను నిలదీశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను హరీశ్‌రావు ఆదేశించారు. పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించి నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులను గూర్చి మాజీమంత్రి ఆరా తీశారు. సుమారు 6 నెలల నుంచి నిధులు రాక పంచాయతీల నిర్వహణ భారంగా ఉందని, పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉందని పలువురు పంచాయతీ కార్యదర్శుల హరీశ్‌రావుకు వివరించారు. పంచాయతీ ట్రాక్టర్ డీజిల్‌కు, వీధి దీపాలు, ఇతరత్రా ఖర్చుల కోసం తమ సొంత డబ్బు పెడుతున్నామని పలువురు కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రైతు భరోసా డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు సదానందం, కనకరాజు, తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీవో జనార్దన్, ఎంపీటీసీలు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చిన్నకోడూరు, జూలై 1: వర్షాకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి హరీశ్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను గూర్చి పీహెచ్‌సీ వైద్యురాలు సరితను అడిగి తెలుసుకున్నారు. ఓపీ, ఏఎన్సీ చెకప్స్, ఫార్మసీలో ఉన్న మందులు, డయాగ్నోస్టిక్ సేవలను పరిశీలించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి: ఎంపీపీ

కొండపాక, జూలై 1: ప్రస్తుత వర్షాకాలంలో ఎలాంటి సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాల్లో పరిశుభ్రత పాటించే విధంగా గ్రామ కార్యదర్శులు తగిన శ్రద్ధ వహించాలని కొండపాక ఎంపీపీ మంచాల అనసూయ కనకరాములు సూచించారు. కొండపాకలో ఐవోసీ భవనంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. గ్రామపంచాయతీల పాలకవర్గం లేకపోవడంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. మొక్కల పెంపకం, మిషన్ భగీరథ కార్యక్రమాలు బాధ్యతగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చింతల సాయిబాబా, ఎంపీటీసీలు బాలాజీ, పత్తి ఆంజనేయులు, అధికారులు పాల్గొన్నారు.



చేర్యాలలో పార్థీవలింగాలను తయారు చేస్తున్న మహిళలు

కోటిలింగార్చనకు పార్థీవ శివలింగాల తయారీ

చేర్యాల, జూలై 1: కాశీలోని శ్రీసాంబసదాశివ మహదేవ సేవాసమితి ఆధ్వర్యంలో వచ్చే నవంబరు 4 నుంచి 13వ తేదీవరకు వారణాసిలో కోటి శివలింగార్చన చేపట్టనున్నారు. ఈ మేరకు చేర్యాల పట్టణంలోని ఆర్యవైశ్య మహాసభ వాసవి మహిళా విభాగం సభ్యులు తమవంతుగా 50వేల పార్థీవ లింగాలను అందించేందుకు చర్యలు చేపట్టారు. స్థానిక వైశ్యభవనంలో ఇటీవల కార్యక్రమాన్ని ప్రారంభించగా, సోమవారం వరకు 13వేల శివలింగాలను తయారు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. మరికొద్ది రోజుల్లో 37వేల లింగాలను పూర్తిచేసి కాశీలో అందజేయనున్నట్లు తెలిపారు.

వాసవీమాతకు 102 రకాల నైవేద్యాలు

దౌల్తాబాద్, జూలై 1: దౌల్తాబాద్ మండల ఆర్యవైశ్య మండలాధ్యక్షుడు గంప రవి ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి గంప శ్రీనివాస్, జిల్లా మహిళావిభాగం అధ్యక్షురాలు హేమలత, ఆర్యవైశ్య సభ్యులతో కలిసి మండల కేంద్రంలోని ధర్మశాలలో 41వ రోజు వాసవీమాతకు 102 రకాల నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరిత, రత్నాకర్,గంగిశెట్టి శ్రీనివాస్, సిద్ది భిక్షపతి, శేఖర్, నవీన్, మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.



వాసవీమాత సన్నిధిలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మిరుదొడ్డి, జూలై 1: మండల కేంద్రంలోని ఆఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేకపూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితుడు రాజపున్నయ్యశర్మ ఆధ్వర్యంలో జ్యేష్టమాసం దశమిప్రయుక్తను పురస్కరించుకుని పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌శర్మ, రమేష్‌శర్మ, భిక్షపతి, ప్రభాకర్, ఆంజనేయులు, మల్లికార్జున, లింగం తదితరులున్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

కుకునూరుపల్లి, జూలై 1: ఉద్యోగులకు బదిలీలు సహజమని, బదిలీ మరింత బాధ్యతను పెంచే విధంగా ఉండాలని వైస్ ఎంపీపీ దేవి రవీందర్ తెలిపారు. 14ఏళ్లపాటు లకుడారం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసిన కవిత బదిలీపై మరో పాఠశాలకు వెళ్తున్న సందర్భంగా సోమవారం వైస్‌ఎంపీపీ దేవి రవీందర్ ఆమెను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలం పాఠశాలకు ఆమె చేసిన సేవలు మర్చిపోలేనివన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నేర్పించారని కొనియాడారు. ఉపాధ్యాయురాలు కవిత పాఠశాలను విడిచి వెళ్తున్న సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు బోరున విలపిస్తూ తమ పాఠశాలలోనే ఉండాలని కోరారు. సన్మాన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ముక్తేందర్‌రెడ్డి, సంతోష్, నర్సింహులు, అరవింద్, బాలకృష్ణ, రాజులు తదితరులు పాల్గొన్నారు.



టీచర్‌ను సన్మానిస్తున్న దేవి రవీందర్

నేడు కొండపోచమ్మ హుండీ లెక్కింపు

జగదేవ్‌పూర్, జూలై 1: మండలంలోని తిగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలో గల శ్రీకొండపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపును మంగళవారం నిర్వహిస్తున్నామని ఈవీ రవికుమార్ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో హుండీ లెక్కింపు ఉంటుందని తెలిపారు.

నేడు సొసైటీ మహాజనసభ

మద్దూరు, జూలై 1: మద్దూరు మండలం రేబర్తిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో మహాజనసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఈవో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సంఘం ఆవరణలో నిర్వహించే సమావేశానికి సకాలంలో పాలకవర్గ సభ్యులు హాజరుకావాలని తెలిపారు.

రేపు మద్దూరు మండల సభ

మద్దూరు, జూలై 1: రేపు మద్దూరు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాంమోహన్ తెలిపారు. ఈ నెల 3న ఉదయం 11 గంటలకు ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

మాదిగల బహిరంగ సభను విజయవంతం చేయాలి

దౌల్తాబాద్, జూలై 1: హలోమాదిగ చలో హైదరాబాద్ కార్యక్రమానికి మండలంలోని ప్రతీ గ్రామం నుంచి మాదిగలు స్వచ్ఛందంగా తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగపల్లి సాయిలు పిలుపునిచ్చారు. సోమవారం దౌల్తాబాద్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిపాపన్న అధ్యక్షతన ఈ నెల 7న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగే హలో మాదిగ చలో బహిరంగ సభకు ప్రతీ గ్రామం నుంచి 10 మంది చొప్పున వచ్చి ఐక్యతను చాటి చెప్పాలన్నారు. సభలో మాదిగ జాతి కోసం అమరులైన కుటుంబాలవారికి సన్మానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాజు,శ్రీకాంత్,యాదగిరి,నవీన్, నర్సింహులు, మహేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'పల్లా' అరెస్టును నిరసిస్తూ బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన

చేర్యాల, జూలై 1: నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లో మోతీలాల్ చేస్తున్న దీక్షకు మద్దతుగా వెళ్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం చేర్యాల మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు మండలాల నాయకులు స్థానిక గాంధీ చౌక్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకలపై అక్కసువెళ్లగక్కుతుందని మండిపడ్డారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వానికి గుణపాఠం తప్పక చెబుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, జడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప, ఎంపీపీ తలారి కీర్తన, కౌన్సిలర్ మంగోలు చంటి, మండలాధ్యక్షులు అనంతుల మల్లేశం, మేక సంతోశ్, నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, పచ్చిమడ్ల మానస, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, ముస్త్యాల బాలనర్సయ్య, పెడుతల ఎల్లారెడి తదితరులు పాల్గొన్నారు.



చేర్యాలలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

విద్యార్థుల విజయాలే ఉపాధ్యాయుల అంకితభావానికి గీటురాయి



ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సిధారెడ్డి

గజ్వేల్, జూలై 1: ప్రతీ ఉద్యోగికి తన జీవితంలో చేసిన సేవలే గుర్తుంటాయని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్, కవి, రచయిత నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సిద్దిపేట డిగ్రీ కళాశాల విద్యార్థిగా, ప్రిన్సిపాల్‌గా పనిచేసి, గజ్వేల్‌లో విరమణ పొందడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు సాధించిన విజయాలే ఉపాధ్యాయుల అంకితభావానికి గీటురాయి అన్నారు. అనంతరం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ సిద్దిపేట కళాశాలలో మాత్రమే కాకుండా గజ్వేల్ డిగ్రీ కళాశాలలో శ్రీనివాస్‌రెడ్డి విజయాలను గుర్తు చేసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు, ప్రభు మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, డాక్టర్ పద్మజ్యోతి, గోపాల్ రెడ్డి, సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై భారం మోపేందుకు సిద్ధమైన కేంద్రప్రభుత్వం

చేర్యాల, జూలై 1: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగసంస్థలను నిర్వీర్యం చేయడంతో పాటు సామాన్య ప్రజలపై భారం మోపడానికి సంసిద్ధమైందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య విమర్శించారు. కొమురవెల్లి మండలకేంద్రంలో నిర్వహిస్తున్న పార్టీ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిపక్షం లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించాలన్న దురాలోచనతో బీజేపీ మతోన్మాద విధానాలను అవలంభిస్తున్న క్రమంలో పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం నేర్పారన్నారు. బొగ్గుగనులను వేలంవేయడానికి చర్యలు తీసుకోవడం తగదని, ప్రభుత్వ రంగ విద్యుత్తుకు బొగ్గు లేకుండా చేస్తుందన్నారు. దీంతో ప్రైవేటు కంపెనీల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితిలో ప్రజలకు రాయితీలు, ఉచిత విద్యుత్ అమలును ఎత్తేయాల్సివస్తుందన్నారు. సింగరేణి బ్లాకుల వేలం వేస్తే ప్రజలపై భారం తప్పదన్నారు. బొగ్గుగనుల వేలానికి వ్యతిరేకంగా రాజకీయ బేదాభిప్రాయాలను పక్కనబెట్టి కేంద్రాన్ని నిలదీయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీసభ్యుడు బండారు రవికుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, నాయకులు బండి శశిధర్, గోపాలస్వామి, శెట్టిపల్లి సత్తిరెడ్డి, సందబోయిన ఎల్లయ్య, భాస్కర్ వెంకట్‌మావో తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు నాగయ్య

వైద్యుల సేవలు ఎంతో గొప్పవి

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిస్వార్థ సేవలందించిన డాక్టర్లను, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కరోనా సమయంలో వైద్యసిబ్బంది అందించిన సేవలు ఎనలేనివని పలువురు కొనియాడారు.

సిద్దిపేట టౌన్, జూలై 1: సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్యులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్, గైనకాలజీ విభాగ హెచ్‌వోడీ డాక్టర్ శోభను వైద్యులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు అపర్ణ, పరమజ్యోతి, క్రాంతికుమార్, లక్ష్మి, రాజు, సదానందం, అనుపమ, సురేష్‌బాబు, వేణు, అనస్తీషియా విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణచందర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సిద్దిపేట పట్టణంలో హెల్పింగ్ నేచర్ గ్రూప్ ఆధ్వర్యంలో సభ్యులు పలువురు వైద్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు క్రాంతి కుమార్, శ్రవణ్ కుమార్, మణిదీప్, కుమారస్వామి, సభ్యులు శివకుమార్, శేఖర్, విజయ్, నాగేందర్, ప్రకాష్, నాగరాజు, వినయ్, బాలాజీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్, జూలై 1: కరోనా సమయంలో వైద్యులు అందించిన సేవలు ఎంతో గొప్పవని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం వాసవీక్లబ్, వాసవీయూత్‌క్లబ్, వాసవీవనితాక్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే సందర్భంగా డాక్టర్లను, చార్టెర్ట్ అకౌంటర్స్ డే సందర్భంగా సీఏలను మున్సిపల్ చైర్మన్ రాజమౌళితో కలసి వాసవీ క్లబ్ అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్‌గుప్తా సన్మానించారు. గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్‌ఎంవో రాము ఆధ్వర్యంలో డాక్టర్స్ డేను పురస్కరించుకుని డాక్టర్లంతా కలసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ కరోనా సమయంలో డాక్టర్లు కరోనా వ్యాధిగ్రస్తులకు అందించిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు.



సిద్దిపేటలోని జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ కిషోర్‌కుమార్‌ను సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

- **మర్కుక్:** జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మైత్రీ అల్వాల్ జిల్లా పరిషత్ మర్కుక్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎమ్. దీప, ల్యాబ్ టెక్నీషియన్ నర్సింహులును విద్యార్థుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. వెంకటేశం, నరహరి ప్రసాద్, నాగేశ్వర్‌రావు, పద్మారెడ్డి, రమేష్, శ్రీనివాసరావు, లయన్ రమణారావు, గణేష్, సిద్దయ్య, మాధవి, ఫౌజియా, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్స్‌డే
- **కుకునూరుపల్లి:** కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందిని వాసవీక్లబ్‌సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కొండపాక మండల అధ్యక్షుడు ఉప్పల రాజు, సభ్యులు శివప్రసాద్, రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో నిందితుడికి రిమాండ్

సిద్దిపేట క్రైం, జూలై 1: మహిళలను మాయమాటలతో బురిడీ కొట్టించి డబ్బుతో ఉడాయించిన నిందితుడిని పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. సోమవారం సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన అల్లెపు కృష్ణ అనే వ్యక్తి ఆదివారం ఉదయం ధోబీగల్లిలో ఓ వృద్ధ మహిళను పేరు పెట్టి పిలిచి కొత్త ప్రభుత్వం వారు పింఛన్ రాని వారికి పింఛన్ ఇప్పించాలని తనను పంపినట్టు మాయమాటలు చెప్పి ఆమె నుంచి రూ.3300 తీసుకొని ఉడాయించాడు. రెండు గంటల తర్వాత అదే కాలనీలో మరో మహిళ నుంచి ఇదే విధంగా రూ.3,600 తీసుకొని పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు సోమవారం నిందితుడిని ధోబీగల్లి లోని శ్రీరాముని గుడి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని, రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితుడు కృష్ణ గతంలో సిద్దిపేట, కరీంనగర్, వరంగల్, పెద్దపల్లి జిల్లాల్లో ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలకు పింఛన్ ఇప్పిస్తానంటూ మోసం చేసి వారి నుంచి డబ్బులు, నగలను బలవంతంగా తీసుకొని పోయిన కేసులు ఉన్నాయని తెలిపారు. 15 రోజుల క్రితం చర్లపల్లి జైలు నుంచి విడుదలై నిందితుడు మళ్లీ చీటింగ్‌కు పాల్పడ్డాడని సీఐ వివరించారు.

భావి పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలకం



రాయపోల్ జడ్పీహెచ్ఎస్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, జూలై 1: భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలకమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మనోహర్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మామిడి మోహన్‌రెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ, జడ్పీటీసీ యాదగిరి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్‌రెడ్డి, ఎంఈవో నర్సవ్వ, రాంసాగర్ హెచ్‌ఎం సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దారు బదిలీ

మద్దూరు, జూలై 1 : మద్దూరు తహసిల్దారు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ ఎస్. గోపాల్ బెజ్జంకి మండలానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం మద్దూరు తహసీల్ కార్యాలయంలో తహసీల్దారు సంజీవ్‌కుమార్ బదిలీపై వెళుతున్న డీటీ గోపాల్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో సమాజంలో గుర్తింపు

చిన్నకోడూరు, జూలై 1: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో 135 మంది విద్యార్థులకు చక్రపాణి ఆగ్రో ఇండస్ట్రీస్ సిద్దిపేట వారి ఆర్థిక సాయంతో, సిద్దిపేట లయన్స్ క్లబ్ వారి సౌజన్యంతో నోట్స్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైయర్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటలక్ష్మి, కాంప్లెక్స్ హెచ్‌ఎం లక్ష్మయ్య, పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్లా షరీఫ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లికి కొత్త ఎస్‌ఐ

చేర్యాల, జూలై 1: కొమురవెల్లి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా రాజు గౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు సోమవారం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ కార్యాలయ రికార్డులలో సంతకాలు చేసి విధులలోకి చేరారు. అనంతరం సిద్దిపేట సీపీ అనూరాధను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గతంలో పనిచేసిన నాగరాజును కుటుంబ వివాదాల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురయ్యాడు. నెలన్నర రోజులు గడిచినా మరో ఎస్‌ఐని నియమించకపోవడంతో కార్యాలయ పాలన గాడితప్పింది. ప్రతీ సమస్యకు ప్రజలు చేర్యాల సర్కిల్ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'కొమురవెల్లికి కొత్త ఎస్‌ఐ వచ్చేనా..!' అనే శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం విదితమే. అంతేకాకుండా రెండు రోజులక్రితం గంజాయి మత్తులో పలువురు యువకులు మల్లన్న భక్తులపై దాడికి పాల్పడటం కలకలం రేపింది. దీంతో స్పందించిన పోలీసుశాఖ ఉన్నతాధికారులు ఇల్లంతకుంట ఎస్‌ఐ రాజును కొమురవెల్లికి బదిలీ చేయగా, ఆయన విధులు చేపట్టారు. అంతేకాకుండా ఇరువురు కానిస్టేబుళ్లను అదనంగా నియమించగా, వారు సైతం విధుల్లో చేరారు.



ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజు

కార్మికులకు నిత్యావసర సరుకుల అందజేత

దౌల్తాబాద్, జూలై 1: నాలుగు నెలలుగా జీతాలు అందక అవస్థలు పడుతున్న పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు అందజేసి ఓ వ్యక్తి దాతృత్వం చాటుకున్నాడు. సోమవారం మండల పరిధిలోని చెట్ల నర్సంపల్లికి చెందిన దుబాషి గోపి గ్రామ పారిశుధ్య కార్మికులకు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు రూ.500 అందజేశారు. అదే విధంగా గ్రామానికి చెందిన దొడ్డి మల్లేశం అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందాడు. గోపి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.2వేలతో పాటు 50 కిలోల బియ్యం అందించారు.

రోగికి ఎల్‌వోసి అందజేసిన పూజల హరికృష్ణ

సిద్దిపేట టౌన్, జూలై 1: పట్టణంలోని 38 వార్డుకు చెందిన నాగరాజు అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు పూజల హరికృష్ణ సోమవారం అతడికి చికిత్స నిమిత్తం రూ. 10 లక్షల ఎల్‌వోసిని అందజేశారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం సహాయనిధి ద్వారా ఈ ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. వెంట నాయకులు రాజిరెడ్డి, సీతబాలు, వాహబ్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పంజాల వెంకట్‌గౌడ్

గజ్వేల్, జూలై 1: గౌడ కుల హక్కుల పరిరక్షణ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా గజ్వేల్ మండలం బూర్గుపల్లి గ్రామానికి చెందిన పంజాల వెంకట్ గౌడ్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు నక్క కృష్ణాగౌడ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ తనకు ఇచ్చిన అవకాశంతో కులం అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని, గౌడ హక్కుల సాధనలో భాగంగా జరిగే ఏ ఉద్యమంలో అయినా ముందుంటానని ప్రకటించారు.

మెదక్ జిల్లా ఎస్సీ మోర్చా ఇన్‌చార్జిగా స్వామి

రాయపోల్, జూలై 1: భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా ఇన్‌చార్జిగా మండలంలోని బేగంపేటకు చెందిన మంకిడి స్వామి నియామకమయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

'బీఆర్‌ఎస్ లేకపోతే తెలంగాణ అంధకారం'

చేర్యాల, జూలై 1 : బీఆర్‌ఎస్ లేకపోతే తెలంగాణ అంధకారమేనని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ పేర్కొన్నారు. చేర్యాల మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంపై బీజేపీ ఆది నుంచి వివక్ష వహించిందని, రాష్ట్రానికి రావలసిన ప్రాజెక్టులు, నిధుల సాధన కోసం బీఆర్‌ఎస్ అలుపెరుగని పోరాటం చేసిందన్నారు. నిధుల విషయంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి బీఆర్‌ఎస్‌పై చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని ఖండించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా మోసం చేసిన కాంగ్రెస్‌కు రాష్ట్రాన్ని కంటికిరెప్పలా కాపాడుకున్న బీఆర్‌ఎస్ ఊసెత్తే అర్హత లేదన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

మర్కుక్, జూలై 1: మండలంలోని చేబర్తి గ్రామానికి చెందిన పాలే యాదమ్మ(60) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ ఆదివారం మృతి చెందింది. ఇదే గ్రామానికి చెందిన చాట్లపల్లి మల్లేశం(58), బొమ్మని నర్సమ్మ (70) అనారోగ్యంతో బాధపడుతూ వారం క్రితం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మండల వైస్ ఎంపీపీ మంద బాల్‌రెడ్డి, వంటిమామిడి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బబ్బూరి రాందాస్‌గౌడ్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ అశోక్‌తో కలిసి సోమవారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ. 5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించినవారిలో గ్రామ రైతుబంధు మాజీ అధ్యక్షుడు జాలని బాల్‌నర్సయ్య, గ్రామస్థులు గాలేష్, యాదగిరి, రాజు, మల్లేశం, కృష్ణ తదితరులు ఉన్నారు.